"అలా అయితే నేనే ఆ దేవుడని తెలుసుకోవడం ఎలా?"

"ఏముంది? ఉప్పులా వుండు చాలు."

"అర్థం కాలేదు స్వామీ."

ఏదీ పాడవకుండా ఉప్పు ఎలా కాపాడుతుందో అలా లోకుల మలినాలని నువ్వు ప్రక్షాళన చేయాలి. ఆ ప్రయత్నంలో రుచిని ఇచ్చే ఉప్పులా నీమాటలు, చేతల మీద వాళ్ళకి రుచి ఏర్పడాలి. ఉప్పు మితంగా వాడితేనే ఎలా రుచినిస్తుందో అలా నీ మాటలు కూడా మితంగానే ఉండాలి. అంతేకాక ఉప్పు విశ్వాసానికి గుర్తు. సదా పరమాత్మ మీద విశ్వాసంతో ఉండాలి. ఉప్పులో మలినాలు కలిసినా నీళ్ళతో చేరితే ఆ మలినాలని ఎలా తేలిగ్గా వదిలించుకుంటుందో, అలా భగవద్భక్తితో కలిసి నీలోని మలినాలని విసర్జించాలి."

"ఇప్పుడర్థమైంది స్వామీ."

## 53. హెచ్చరిక

నయాగరా జలపాతం సమీపంలోని ఓ మంచుశిల మీద ఓ గద్ద కూర్చునివుంది. ప్రవాహంలో ఆ మంచుముక్క వేగంగా జలపాతం వైపు ప్రయాణిస్తోంది. ఇతర పక్షులు, జంతువులు ఆ గద్దకి చేసిన హెచ్చరికలని అది పట్టించుకోలేదు.

"నాకేం భయంలేదు. నాకు శక్తివంతమైన రెక్కలున్నాయి. నేను కూర్చున్నచోటినించి ఎప్పుడైనా ఎగిరిపోగలను." గర్వంగా చెప్పిందా గద్ద.

అకస్మాత్తుగా ఆ మంచుముక్క జలపాతం అంచు దగ్గరకి చేరుకుంది. హోరు విని ఆ గద్ద ప్రమాదం నించి తప్పించుకోడానికి తన రెక్కలని విస్తరించి ఎగరబోయింది. ఐతే, దాని కాళ్ళు అప్పటికే ఆ శిల మీద గడ్డకట్టిన మంచులో కూరుకుపోవడంతో దాన్నించి విడివడలేదు.

ఇంకా ఎక్కువ చెప్పాలా? ఇలాగే మనలో చాలామంది 'పాపం' లో చిక్కుకోం అనుకుంటూ ఎన్నో పనులు చేస్తూ, చివరికి దాని యొక్క పరిణామాలనించి విడివడలేక కష్టాలు అనుభవిస్తున్నాం."

## 54. (అ)జ్ఞాని

ముఖాన తేజస్సు ఉట్టిపడే ఓ గురువు దర్శనార్థం వచ్చిన వారు తమకి ఏదైనా మంచి విషయాలు బోధించమని ప్రార్థించారు.

"ఏం వింటారు? నా మాటలు కప్పల బెకబెకలతో సమానం." నవ్వుతూ చెప్పాడాయన.

వాళ్ళల్లో శాస్త్రాలు చదువుకున్న ఓ పండితుడు వున్నాడు. అతను వెంటనే గురువుకి నమస్కరించి చెప్పాడు.

"స్వామీ! మీ బెకబెకలేగా మాలాంటి అజ్ఞానులకి ముక్తిదాయకం. అవే చెప్పండి."

తన మాటల్లోని అర్థం తెలీక తనవంక విస్మయంగా చూసే మిగిలిన వారివంక చూసి ఆ పండితుడు ఇలా వివరించాడు.

"ఉపనిషత్తులన్నిటిలో ఆఖరిది మాండ్యూకోపనిషత్తు. సంస్కృతంలో మండూకం అంటే కప్ప అని అర్థం. ప్రాపంచిక సుఖాల వెంట పరుగులు తీసే అజ్ఞానులకి దాన్ని గురువు బోధిస్తే, అది కప్పల బెకబెకల్లా శ్రావ్యంగా వుండదు. కాని కప్పల బెకబెకలని విని ఆనందించేవారూ ఈలోకంలో వున్నారు. వారు రైతులు. వర్షం రాబోయే సూచనగా కప్పలు అరుస్తాయి. అదేవిధంగా జ్ఞానాన్ని కోరే సాధకులకి గురువాక్యాలు అమృతతుల్యంగా వుంటాయి."

వారంతా గురువు చేసిన ఆధ్యాత్మిక బోధనలని శ్రద్ధగా విని అర్థం చేసుకునే ప్రయత్నం చేసారు.